# లగ్న బలిమి

మాలతీ చందూర్




అవి క ళాకేళి వార్షికోత్సవదినాలు.

ఆ రోజు చివరిదినం. నాటకం సగం అయింది. ఇంటర్‌వెల్. కూల్‌డ్రింక్స్ తాగుదామన్నాడు నారాయణరావు. ఇద్దరం లేచాము. పక్కవాళ్ళ పలకరింపు చిరునవ్వులకి నే సమాధానంగా నవ్వాను. వెనక ఎవరో సన్నగా "ఆ అమ్మాయి సుబ్బులక్ష్మిగారి పెంపుడు కూతురు. ఆవిడ పెంచుకునేదాకా ఈ కళ్యాణి దిక్కూ మొక్కూ లేని పిల్ల. ఇప్పుడో లక్ష రూపాయల ఆస్తి దాకా వుంది. సుబ్బులక్షమ్మగారు చచ్చిపోతూ ఆస్తంతా ఈ పిల్లకే రాసింది," ఈ మాటలు నా చెవుల్లో దూరాయి. వొళ్ళు మండింది.

నాకన్నీ వున్నాయి - కాని ఏమీలేదు, అందరూ అసూయపడే అదృష్టం పట్టింది కాని ప్రేమాభిమానాలెరగదు నా బ్రదుకు. ఎవరో వీపుమీద చెయ్యేశారు. తిరిగి చూస్తునుకదా శ్యామల.

"ఇల్లా నలుగురిలోకి వస్తూండాలి. అంతేగాని ఎప్పుడూ ఆ బంగళాలో కూచోటమేనా?"

"తొందరగా పద - వూరికే గుంపులుగా చేరుతారు మనుషులు" అన్నాను విసుగ్గా. కబుర్లాడుతూ కూల్‌డ్రింక్స్ పుచ్చుకున్నాము. నారాయణరావుకి శ్యామలని పరిచయం చేశాను. నారాయణరావు నా పెంపుడుతల్లి గారి ప్లీడరు. ఆవిడ జబ్బులో వుండగా ఆస్తి వ్యవహారాలకి మా ఇంటికి చాలాసార్లు వస్తూండటంవల్ల నాకూ నారాయణరావుకీ స్నేహం అయింది. సుబ్బులక్షమ్మగారు బతికున్నన్నాళ్ళూ అతనితో నే నెక్కువ మాట్లాడి ఎరగను. ఈ రెండు నెలలనుంచీ ఒకటి రెండుసార్లు కలుసుకుంటూ గంటలతరబడి లోకాభిరామాయణం మాట్లాడుతూండేవాళ్ళం. "శ్యామలా మీ రుమాలు జారిపోయింది," అని వెనకనుంచి ఎవరిదో కంఠం వినబడింది. కంఠం కొత్తగా వున్నా ఆత్మీయంగా తోచింది. వెనక్కి తిరిగాను.

పొడుగ్గా దృఢంగా వున్నాడు మనిషి, తెల్లటి పంచె, సిల్కులాల్చీ, కళ్ళజోడు లేదు. అకస్మాత్తుగా అతనికళ్లు నాకళ్లను కలుసుకున్నాయి. నా హృదయతాపాన్ని తీర్చే చల్లదనమూ చూపులో వుందా? ఆ రోజు కనకాంబరం జరీచీరె - నల్ల జాకెట్టూ వేసుకున్నాను. నా పసిమికి తగ్గ డ్రస్. పదకొండేళ్ళనుంచీ, చచ్చిపోయిన రాధస్థానంలో అసంతృప్తిగా బతుకు

తోంది కళ్యాణి.

మాది చాలా బీద సంసారం. సుబ్బలక్షమ్మగారు మాకేదో దూరపు చుట్టం. లక్షాధికారైన ఆవిడకూ మాకూ ఏం సంబంధం వుంటుంది? మా అమ్మ నాకు నాలుగో ఏటనే పోయింది. ప్రాణ సమానంగా పెంచుతూ వచ్చిన రాధ చనిపోవడంతో సుబ్బలక్ష మ్మగారికి ఇల్లు అరణ్యమయింది. యాత్రలు సేవించి వస్తూ ఒక సాయింత్రం మా ఇంట్లో దిగింది. నేను అచ్చంగా రాధని పోలి వున్నానని చెప్తూ నన్ను తనకి పెంపు ఇవ్వమంది నాన్నతో. బీదవాళ్లం! నాన్న ఒద్దంటాడా? కనకపు సింహాసన మెక్కినట్లయింది నాన్నకి. ఇది పది పన్నెండేళ్ళ క్రితం సంగతి. ఇప్పుడు నాన్నాలేడు, సుబ్బలక్షమ్మగారూ లేరు.

అప్పటినుంచీ నేను సుబ్బలక్ష్మిగారిని అంటి పెట్టుకునే వున్నాను. 'అమ్మా' అని పిలిపించుకునేది నాచేత. కొత్త బహుమతులు, పరికిణీలు, చొక్కాలు, ఒకటేమిటి కొండమీద కోతికూడా దిగి వచ్చేది నే కావాలంటే. మొదటిలో ఇదంతా నా మీద ప్రేమవల్ల అనుకున్నా. కాని రానురాను తెలిసింది - ఆవిడ నాకోసం ఏంచేసినా మరణించిన రాధను తలచుకునే చేస్తోందని. నాక్కావలసినవన్నీ ఇచ్చేది. కాని ఆమె మనస్సులో ఎప్పుడూ రాధే వుండేది. "స్కూలు నాటకాలలో నీకు నాయిక పాత్ర ఎందుకు ఇవ్వరు. రాధకి ఇచ్చేవాళ్ళే?" అనేది అమ్మ.

రాధ స్కూలు నాటకాలలో రాణించేదని ప్రతీతి. రాధకున్న చురుకు నాకు లేదు. ఒక నాటకంలో మంచి పాత్ర ఇచ్చారు నాకు - అది తగలేశాను, నాకు నాటకాలంటే అంత ఇష్టంలేదు. కాని అమ్మ గమనించేది కాదు ఆ సంగతి.

నాటకంలోని అపజయం జీవితంలో నన్ను వెన్నాడుతూ వచ్చింది. ఇరవై ఏళ్ళు వచ్చినా ప్రేమ అభిమానాలు లేకుండానే జీవించాను. ఈ మధ్య నా డబ్బు చూచి కొందరు మొగాళ్ళు వెంట పడు తున్నారు. నన్ను ఆకర్షించి కట్టేసుకున్న ఈ కొత్త మనిషి కళ్ళు శ్యామల భుజాలపై నుంచి నవ్వు తున్నాయి.

శ్యామల చిరునవ్వుతో "ఈయన పేరు ఆనంద రావు" అంది,

"నమస్కారం" అన్నాను నేను.

"ఈమె కళ్యాణి - సుబ్బలక్షమ్మగారి పెంపుడు కూతురు" పరిచయం పూర్తిచేసింది శ్యామల.

పురుషులముందు సిగ్గెరగని నేను సిగ్గుపడటం శ్యామల కనిపెట్టింది. పెళసరంగా కొట్టినట్లు మాట్లా డటం నా కలవాటు. మరే మొగాడో అయితే, ఇప్పుడే నే చూసిన నాటకాన్ని నాలుగు తిడుతూ విమర్శించేదాన్ని.

మళ్ళీ హాల్లోకివచ్చాం. తెరఎత్తారు. ఆనంద్ నాపక్కన చేరాడు. నాటకం చివరదాకా ఏదో, ఏమో మాట్లాడుతూనే వున్నాం. అతనికి బర్మాలో కలపవర్తకం: కొన్నాళ్ళు మదరాసులో గడపటానికి వచ్చాట్ట. నాటకం అఖరయింది. అంతా బయటికి వచ్చాం, నారాయణరావు కొద్దిగా చికాకుగా కని పించాడు. నేనేం లెఖ్ఖపెట్టలేదు; ఆ సాయంత్రం ఆనంద్ చెప్పిన మాటలన్నీ నా చెవులకి సంగీతం.

కారులో శ్యామలనీ ఆనంద్‌నీగూడా ఎక్కిం చాను. ముందు ఆడవాళ్ళము, వెనక మొగాళ్ళు, చివరకు కారులో నేను ఆనంద్ మిగిలాము. వెనక నుంచి బుజము మీదిగా వేసిన చెయ్యి నా ముంగు రులను ప్రేమగా తాకుతోంది. నా హృదయ కవాటం తెరచుకొంది. ఆనంద్ నన్ను తన ప్రేమబంధాలలో కట్టేసుకున్నాడు. మర్నాడు వుదయం మా ఇంటికి రమ్మని పిలచాను. ఇంటికి నేనే రాణినిగా, సుబ్బ లక్షమ్మగారు దివంగతు లయినప్పటినుంచి!

మర్నాడు ఇద్దరం కలసి తిరుగుతూ వుంటే రోజూ చూసే రోడ్లే ఎంతో అందంగా కనిపించాయి. నాలుగో రోజు మధ్యాహ్నం తోటలో ఎంతసేపో నడిచాం. నాకు భరించలేనంత సంతోషంగా ఉంది. ఆనందానికీ ప్రేమకీ చేతులు చాచి చాచి వున్న నాకుఅ రోజున అవి దొరికినట్లయింది. నడుస్తున్నాం. ఆనంద్ నావంక తినేసేట్టు చూస్తున్నాడు. నీడలో గబుక్కున ఆగాడు. మోటుగా రెండు చేతుల్లోనూ నన్ను ఇముడ్చుకున్నాడు. అతని చేతులు బలంగా ధైర్యం చెప్తున్నాయి. అతని కళ్లు మెరుస్తున్నాయి. కఠినంగా ముద్దెట్టుకొన్నాడు. నా పెదవి చురుక్కు మంది. నే చీదరించుకున్నాను. నిర్లక్ష్యంగా ఒక్క తోపుతోసి "రాకూడదనుకున్నా - నాకు ఈ చెలగాటం గిట్టదు" అన్నాడు.

తెల్లబోయి "ఏమిటి?" అన్నాను. నాగుండె గతుక్కుమంది.

"నువ్వు ధనవంతురాలివని శ్యామల చెప్పింది."

"లోకం అలా అనుకుంటోంది. అమ్మ తన ఆస్తిలో మూడు వంతులు వైద్యశాలకీ, స్కూలుకీ ఇచ్చింది. ఇల్లూ, కొద్ది రొఖ్ఖం నాకు మిగిల్చింది. ఆమె బతికున్నన్నాళ్లూ నాలో తనకూతురు నీడని చూసుకునేది. ఎంత ఇబ్బందిగా వుండేదో నాకు. అనుభవించినవారికిగాని తెలీదు నా అవస్థ."

హృదయంలో భద్రంగా దాచిన రహస్యాలన్నీ, ఎప్పుడూ ఎవ్వరికీ చెప్పలేననుకొన్నవన్నీ, చెప్పాను. ప్రేమానురాగా లెరక్క ఎలా కృంగిపోయానో వెళ్ళ బోసుకున్నాను. చచ్చిన పిల్లతో ప్రతిక్షణం పోటీ చేసి ఎలా ప్రతిసారీ వోడిపోయిందీ చెప్పాను. "రాధకి బదులుగా తప్ప - మరే విధంగానూ నన్ను అమ్మ ప్రేమించలేకపోయింది. నేనో మనిషినని ఆమె మర్చిపోయేది." కన్నీళ్లుకారాయి. అతని బాహువుల్లో వెక్కి వెక్కి ఏడ్చాను. బోర్లగిలాపడిన పాపని బుజ్జగించినట్లు సముదాయించాడు. చిన్న ప్పుడు వేలుకోసుకుని ఏడుస్తూ అమ్మ దగ్గిరకు పరుగెత్తే గుడ్డెర్రజేసి దాది-సేత కట్టు కట్టించుకోమనేది.

"పిచ్చిపిల్లా, ఏడవకు. నేను వున్నాగా. అంతా మర్చిపో, నేను ప్రేమిస్తున్నాను." అంటూ సముదా యించాడు. మోడైపోయిన నా జీవితం చిగురి స్తుందా?

ఆ రాత్రి ఆనంద్ బంధువులింటికి భోజనానికి వెళ్లాము. మధ్యాహ్నం ఎన్నోసార్లు ఫోన్ చేశాడు.

"ఎవరా బంధువులు" అన్నా వెళ్తూ వెళ్తూ.

"మావాళ్లు,"

"మావాళ్లు" అనే ముందు అతను కొంచెం ఆలోచించి అన్నట్టున్నాడు. తనకీ వూళ్లో బంధువు లున్నట్టు నాతో అనలేదు. తల్లీ తండ్రీ అయివుండరు. కాకపోతే బాబాయి పిన్నీ అయివుండాలి.

'నీ కేమవుతారు వాళ్లు?"

"ముందు, చెప్పను. నువ్వే తెలుసుకోవాలి." అన్నాడు తమాషాగా.

ఇద్దరం చిలకా గోరింకల్లా మాట్లాడుకుంటూ నడుస్తున్నాం. ప్రేమ ఎన్ని మాటలో నేర్పుతుంది. కలలు, ఆశలు - పూలవాసనలు - అదంతా ఒక మైకం.

"ఇదే ఇల్లు" అన్నాడు గేటుతోస్తూ,

నాకు మాత్రం దుడుకుగా వుంది. తెలీని వారింటికి వెళ్లడమెలా;? మళ్లీ అడిగాను "వాళ్లు నీకేమవుతారు" అని.

నావంక పదునుగా చూశాడు, ఆనంద్ గొంతు సవిరించుకొని "అమ్మా.."

"అంటే మీ అమ్మగారా?"

"కాదు, వాళ్లని అమ్మా- నాన్నా అని పిలుస్తాను. నేనంటే ఎంతో ఆపేక్ష వారికి. వారి హృదయాలూ గృహద్వారాలూ నాకెప్పుడూ ఆహ్వానం ఇస్తూనే వుంటాయి - కాని వాళ్లు నాకు అత్త మామలు."

"మీ అత్త మామలా?" చీకట్లోకి తలుపు తెరుచుకు నడుస్తున్నట్టయింది, నవనాడులూ కృంగి పోయాయి. "అంటే నువ్వు...." అని తడబడు తున్నాను.

"నాకు పెండ్లి అయిందనే చెప్తున్నా. కాని ఆ విషయం మనకేం అడ్డురాదు. మూడేళ్లయింది జానకి పోయి. అంటే నే బర్మా వెళ్లక మునుపు"

"జానకి!" నా కాళ్లు వొణుకుతున్నాయి.

"జరిగింది మనకేం హానిచెయ్యదు. అంతా అయిపోయింది అది నా జీవితంలోని ఇంకో భాగం." నా కళ్లలోకి చూస్తూ విచారంగా అన్నాడు ఆనంద్.

"చాలా సుఖవంతమైన భాగం అనుకుంటా, ఆమె తల్లిదండ్రులమీదే అంత ప్రేమవుంటే."

"అందులో తప్పేమిటి?" అతను కఠినంగా అడిగాడు.

అతను నాతో దెబ్బలాడుతే బాగుండునని పించింది. ఆనంద్ ఇంకో పిల్లను హృదయ పూర్వ కంగా ప్రేమించాడు. నేను ఆ మొదటి ప్రేమకి ప్రతిధ్వనికాక మరే మవుతాను? అడుగులు గబ గబా వేస్తున్నాను. అతను ఏవో చెప్పాకు పోతున్నాడు. కాని నాకొక్కటీ వినపట్టంలేదు. గుమ్మందగ్గిర కొచ్చాం. ఎంతో ప్రశాంతంగా వుంది హాలు. కుర్చీ లోంచి వృద్ధుడు గబ గబా లేచాడు. లావుగా వుంది ఆయన భార్య - ముగ్గు బుట్టలాటి తల - నన్ను ఎంతో ఆప్యాయంగా రెండు చేతుల్తో లోపలికి తీసుకొచ్చింది. ఎంతో కలుపుగోరుతనం చూపింది.

, నేను ఎక్కువగా మాట్లాడలేక పోయాను. భోజనం ఎలా చేశానో నాకే తెలియదు. నా బుర్ర తిరుగుతోంది. హాల్లో జానకి ఫొటో వేళ్లాడుతోంది. పాపం: పద్దెనిమిదేళ్ళకే నూరేళ్ళూ నిండాయి, ఆనంద్ నాదృష్టికనిపెట్టి ఫొటోతెచ్చి నాచేతికిచ్చాడు. "ఇది

జానకి ఫొటో" అంటూ జీరగొంతుతో అన్నాడు. అతని కంఠం సుబ్బలక్షమ్మగారు ఇంటినిండా వేళ్ళాడేసి రాధ ఫొటోలు చూపిస్తున్నప్పటి కంఠాన్ని పోలి వుంది.

అనంద్‌ని శపించిపోశాను. నన్నిల్లా బాధించి కారణం తెలియనట్టు వూరుకోడం చూస్తే నా వొళ్లు మండిపోయింది. తలనెప్పి అని సాకుతో వెంటనే బయలుదేరాను, ఆనంద్ నా వెంటే వచ్చాడు.

"వాళ్ళు నీకు నచ్చారా? నిన్నుమటుకు చాలా మెచ్చుకున్నారు," అన్నాడు వుత్సాహంగా.

"చాలా కృతజ్ఞురాల్ని," అన్నాను కటువుగా.

అతను నా చెయ్యిపట్టుకుని, "జానకిని గురించి ముందే చెప్పలేదని కోపమా? టైములేకపోయింది," అన్నాడు.

"మనిద్దరికీ పెళ్ళి జరగదు" అన్నా నిక్కచ్చగా.

"ఏమిటి అంటున్నావు - వచ్చే వారంలో పెళ్ళని అందరితో చెప్పాను."

అణుచుకున్న మాటలన్నీ వరదల్లా వచ్చాయి. "మనకి ఎప్పటికీ పెళ్ళికాదు. అసలు వస్తువుకు బదులుగా నటించడం చాలా రోజులు చేశాను. మరొకరి వీణను పదేళ్ళుగా మీటాను, ఇంక వొద్దు ఈ జన్మకి ఆ అవస్థ."

"కళ్యాణీ, నీకేమన్నా పిచ్చా? జానకిని నేను ప్రేమించాను. అదంతా అయిపోయింది. నిన్ను ఇప్పుడు ప్రేమిస్తున్నాను. అది వేరు! ఇది వేరు."

"ఆ ప్రేమని మర్చిపోకుండా వుండేందుకా నేను? అలాంటి ప్రేమలో పీకెదాకా మునిగాను ఇంక చాలు, జానకిని నాలో చూడబోతావు నువ్వు, వొద్దు నేను నిన్ను పెళ్ళాడను."

"నువ్వే ప్రపంచంలో వున్నావ్? పాతికేళ్ళుపై బడ్డ మొగవాడికి ప్రేమానుభవాలు లేకుండా వుంటాయా? నేను భూతకాలంలో జీవించేవాణ్ణి కాదు. కాస్త వోపిగ్గా ఆలోచించు కళ్యాణీ!"

అతని చేతులు నన్ను గట్టిగా బంధించాయి. విడిపించుకునేందుకు ప్రయత్నించి విఫలనయాను. అతని పెదిమలు గట్టిగా నా పెదిమల్ని నొక్కేయి. ఆ కౌగిలిలో అద్యంతాలు మర్చిపోయాను. కౌగిలి వదలి, "నా మీద నమ్మకంలేదా? మరోళ్ళనిగురించి తల పోస్తున్నానంటావా?" అన్నాడు బాధగా.

అతన్నెందుకు ప్రేమించాను? పరుగెత్తాలి. లేకపోతే నన్ను కరిగించి, పెళ్ళికి వొప్పిస్తాడు. పరుగెత్తాను. పది గజాలు వెళ్ళానో లేదో వెనకనుంచి గబుక్కున రెండడుగుల్లో నడుం పట్టుకున్నాడు. "నా దగ్గరనుంచి పారిపోనవసరం లేదు, నువ్వన్నది నీవుద్దేశం ఐతే నిన్ను నేను బాధపెట్టను." రొప్పుతున్నాడు. "నీ అభిప్రాయం అది కాదని నా నమ్మకం, చిన్న తనంచేత అల్లా అని వుంటావు. మన ప్రేమని దమ్మిడీకి కొరగాని వస్తువులా ఎగరవేయటం నే నొప్పను. ఇట్లా చూడు నాకళ్ళలోకి."

అతని కళ్ళల్లోకి చూడగలనా? అమ్మో అవి మళ్ళీ మంత్రించి నన్ను కిందికి లాగుతాయి. అతను దగ్గరగా జరుగుతున్నాడు. మళ్ళీ జారిపోతున్నాను. నాచివరి ఆయుధం వుపయోగించాను. "నే చెప్పినదానికంటె నా దగ్గిర ఎక్కువ ధనం వుందని ఆశపడుతున్నట్టున్నావు."

అతని కంఠంలోంచి బాధగా గుర్రుమని శబ్దం వచ్చింది. కొన్ని క్షణాల పైన చాలా శాంతంగా "నీ హృదయంలోంచి వచ్చినమాట కాదది. మనసు చెదిరి అంటున్నావ్. నన్నింత తేలిగ్గా వదలలేవు. జ్ఞాపకం వుంచుకో."

వెనక్కి తిరిగి చూడకుండా అతని కంఠం వినకుండా పరిగెత్తుకు ఇంటికొచ్చాను. అతను అక్కడే అల్లా విగ్రహంలా నుల్చుని వుండవచ్చు. పరుగెత్తుకెళ్ళి గదిలో పడ్డాను. నేను చేస్తున్నది రైటా, తప్పా?

ఆనందరావు వస్తే అమ్మగారింట్లో లేరని చెప్పమని పనిమనిషితో అన్నాను. టెలిఫోన్ డిస్‌కనెక్ట్ చేశాను. నారాయణరావుకి సాయింత్రం ఫోను చేశాను, ఇద్దరం సినిమాకి పోదామని. అనంద్‌ని మర్చిపోయేందుకు నారాయణరావుని వుపయోగించడం అన్యాయంగా తోచింది. ఆ పరిస్థితిలో నాకు కావలసిందల్లా నవ్వుతూ మాట్లాడేవాళ్ళు. అపని నారాయణరావు చెయ్యగలడు. అందుకే పనిగట్టుకు పిలిచాను. సినిమాకు బైలుదేరాము. నారాయణరావు కమ్మగా మాట్లాడుతాడు కాని అనంద్ వంటి సూదంటురాయికాదు. రాత్రి ఇంటికొస్తూ నారాయణరావుని మాటల సందర్భంలో "ఏ స్త్రనీ ఎప్పుడూ ప్రేమించలేదా?" అని అడిగాను.

"నాకు ప్రేమ వ్యవహారాలకి టైము లేదు" అన్నాడు నిర్లక్ష్యంగా.

ఆనంద్ మూడుసార్లు వచ్చి వెళ్లినట్టు ఇంట్లో అడుగు పెట్టగానే పనిమనిషి చెప్పింది. ఆనంద్ ఏదో వూరు వెళ్లాట్ట. పది రోజుల దాకా రాడట. ఇదీ ఒకందుకు నయమే! గడియారం వెక్కిరింపుగా పదికొట్టింది. పక్కమీద పడి ఎంతో సేపు ఏడ్చాను.

ఈ వారం రోజులు ప్రతిరోజు నారాయణరావుని కలుసుకుంటూనే వున్నాను. ఏ పనీ లేకపోతే మనసు అనంద్‌వైపు పరిగెత్తేది. తిప్పుకోలేకపోయేదాన్ని. ఒకనాటి రాత్రి ఏదో మాటల్లో నారాయణరావు నా చేతుల్ని తాకాడు, 'నీ జీవితంలోని మొట్టమొదటి స్త్రని నేనేనా?" అని అడిగాను.

"అవును" అని సమాధానం ఇచ్చాడు.

నారాయణరావుకి ముద్దుపెట్టుకునే ధైర్యం లేకపోయింది గాని ఒకటికి నాలుగుసార్లు స్పృశిస్తున్నాడు. ఇద్దరం సినిమాకి బయలుదేరాం. నే వెళదామన్న ఆటకుకాక తను మూడుసార్లు చూసిన ఆటకు తీసుకెళ్లాడు. సినిమా సగం అయింది. నాకేం నచ్చలేదు, వెళ్ళి పోవాలనివుంది. నారాయణరావు చాలా వుత్సాహంగా చూస్తున్నాడు. అతని చేతులు కుర్చీ చేతుల్ని గట్టిగా నొక్కి పెట్టాయి. అంత గొప్పగా ఏముందా అని మళ్లా తెరవైపుకి తిరిగాను. ఆ హీరోయిన్ ఏమంత అందంగాకూడా లేదు. "ఇంటికెళ్లి పోదాం" అన్నాను. "పూర్తిగా చూడనిదేరాను" ఎప్పుడూ మృదువుగా మాట్లాడేవాడు, నిష్కర్షగా అన్నాడు మాట. నేపక్కనున్నది కూడా మరిచి తదేక దీక్షతో చూస్తున్నాడు సినిమాని. సినిమా అయిన తరువాత కూడా మూడు నిముషాలు కదలకుండా అలాగే కూర్చున్నాడు. బయటి కొచ్చినా అతను మాట్లాడే స్థితిలోలేడు. నేను కదిపాను "సినిమా అంత బావుందా?" అని.

"ఆ హీరోయిన్ నాకు తెలిసిన అమ్మాయి" అన్నాడు సాలోచనగా.

"ఎలా తెలుసు?"

"చిన్నప్పుడు ఇద్దరం ఒకే స్కూలులో చదువుకునే వాళ్లం. పదిహేనేళ్లు వొచ్చేదాకా ఒక క్షణం విడిచి వుండేదికాదు నన్ను. ఇద్దరం ప్రేమించుకొన్నాం పెళ్లి చేసుకునేందుకు నిశ్చయించుకున్నాం, కాని, ఇంతలోకే ఎవరో సినిమాలో ఛాన్సు ఇచ్చారు. పెద్ద స్టార్ అయింది. నన్నూ - నా ప్రేమను మర్చిపోయింది!"

మళ్లీ పాతపాటేనా? "జీవితంలో నేనే మొదటి స్త్రనన్నావ్!"

"నీకేమన్నా పిచ్చా? పురుషుడు ప్రతి స్త్రీ వద్దా తన అంతరంగిక ప్రేమలు చెప్తాడా ఏమిటి? పద్దెనిమిదిపై బడ్డ మగవాడికి ప్రేమించడ మనేది ప్రకృతి నేర్పుతుంది. ప్రేమ లేకుండావుండటం అసంభవం. నిన్ను చూసేదాకా ప్రవరాఖ్యుడిలా మడిగట్టుకు కూచున్నవాడు. నీ దగ్గరకొచ్చినా, నువ్వు అతన్ని ప్రేమించలేవు."

అర్థం అయింది అంతా. అమృతానికై వెతికి కాళ్ల ముందున్న పాలు పారబోసుకున్నాను. నారాయణరావుతో ఆనంద్ కథ చెప్పాను. అతను నేనే తప్పు చేశానన్ని తీర్పు చెప్పాడు. పిచ్చి వూహలు మాని తక్షణం ఆనంద్‌ని పెళ్లి చేసుకోమని సలహా ఇచ్చాడు, నారాయణరావు.

అ రాత్రి పడుకోబోయే ముందు టెలిఫోన్ మోగింది. ఆనంద్ కంఠం. అప్పుడే వూరినుంచి వచ్చాట్ట. మా ఇద్దరి మధ్యా ఏ వివాదంలేనట్టు, "ఎప్పుడు లగ్నం?" అన్నాడు.

"మీ ఇష్టం" అన్నాను.

['ఆంధ్రజ్యోతి' మాస పత్రిక 1949 దీపావళి సంచిక నుంచి]



**వాటర్ ఫిల్టరును బాగుచేయడం ఎలా?**

మంచినీళ్ళ ఫిల్టరులోని కేండిల్స్ కొన్నాళ్ళ తర్వాత పూడుకుపోతాయి. అప్పు డింక వాటినెంత తోమినా వాటిలో నుంచి నీళ్లు దిగవు. అప్పుడు వాటిని మీడియమ్ గ్రేడ్ ఎమ్రీ పేపరుతో రుద్దాలి. ముఖ్యంగా మట్టి బాగా పేరుకుపోయిన చోట దాంతో శుభ్రపరిచారంటే మళ్లీ క్రొత్త ఫిల్టరు మాదిరిగా నీళ్లు దిగుతాయి.

-రాయప్రోలు లక్ష్మీప్రసాదమ్మ